క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం కొక్కిరాయిలంక, పైడిచింతపాడు గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏలూరు రూరల్ మండలం నరసయ్య తెలిపారు. మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని వినియోగదారులు విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మేరీ మాత ఉత్సవాలు



మేరిమాత ఉత్సవాల్లో పాల్గొన్న విశ్వాసులు

దెందులూరు: ప్రతి ఒక్కరిపై లోకమాత మేరీ మాత ఆశీస్సులు ఉండాలని జాలిపూడి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ తోట అంతోని రాజు అన్నారు. సోమవారం జాలిపూడి విచారణ జాలిపూడి, మాదేపల్లి గ్రామాల్లో మేరీమాత జన్మదినోత్సవ వేడుకలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రెండు గ్రామాల్లో ఆర్‌సీఎం చర్చిలలో మేరీమాత విగ్రహాలకు పూలమాలలు వేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. మేరీ మాత జన్మదిన వేడుక ఉత్సవాల్లో రెండు గ్రామాల ఆర్సీఎం సంఘ పెద్దలు సంఘస్తులు ఉపాధ్యాయులు యువత, సండే స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తేరా ప్రసాద్‌ను అభినందిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దెందులూరు: సమాజనంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం మానూరు గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హెచ్‌ఎం తేర ప్రసాద్‌ను, ఉపాధ్యాయిని తాలాడ అరుణ, ఎస్ఎంసి చైర్మన్ పేరం రాము శిరీష, తేర ప్రభుదాసు, తేరజగదీష్, అంగన్‌వాడీ టీచర్ కడియం కుమారి, విద్యార్థులు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మాదేపల్లి, మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగతోట సునంద కుమారి , శ్రీలక్ష్మి శివజ్యోతి గంగాధర్‌రావు రాధాదేవిలను ఘనంగా సత్కరించారు.

సీతాఫలం..అధరహో!

- ధర కఠినం..
- రాజమండ్రి ఫలానికి డిమాండ్
- డజను రూ. 150 నుంచి 500 వరకు..



నగరంలో నోరూరిస్తున్న సీతాఫలాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సీజనల్‌గా లభ్యమయ్యే పండ్ల రకాల్లో మామిడి పండ్ల తరువాత అంతటి గిరాకీ ఉండే పలమేదైనా ఉంటే సీతాఫలమనే చెప్పాలి. సీతాఫలం, రామాఫలం, లక్ష్మణ ఫలం ఇలా వివిధ రకాల ఫలాలు ఉన్నా సీతాఫలాల పంటలే ఎక్కువగా ఉంటాయి. వేసవి కాలం ముగిసిన అనంతరం ప్రారంభమయ్యే సీతాఫలాల దిగుబడి దాదాపు జనవరి, ఫిబ్రవరి నెల వరకూ వస్తుంది. ఏలూరు జిల్లాకు సంబంధించి నల్లజర్ల, దూబచర్ల, బుట్టాయిగూడెం వంటి మెట్ట ప్రాంతాల అడవుల్లో ఎక్కువగా లభ్యమౌతాయి. ముఖ్యంగా ఏలూరు పరిసర ప్రాంతాలకు ఆయా ప్రాంతాల సరుకు ఎక్కువగా వస్తున్నా అంతకంటే ఎక్కువగా రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో పండే సీతా ఫలాలు కూడా అధికంగా ఇక్కడి మార్కెట్‌కు వస్తూ ఉంటాయి. రాజమండ్రి నుంచి వచ్చే ఫలంలో గింజ తక్కువ, గుజ్జు ఎక్కువగా ఉండడంతో ఇక్కడి ప్రజలు ఆ పలాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. అయితే నల్లజర్ల, దూబచర్ల ప్రాంతాల్లో పండే సీతాఫలం రుచికి తియ్యగా ఉన్నా గింజ ఎక్కువగా ఉంటుంది. ఈ ఫలాలను ఇష్టపడే వారు కూడా ఏలూరులో అధికంగానే ఉంటారు. ఈ రెండు ఫలాలకు పెద్దగా తేడా గుర్తించలేని పరిస్థితి ఉన్నా సీతాఫలాల ప్రియులు మాత్రం ఇట్టే కనిపెట్టేస్తారనడంలో సందేహమే లేదు.

ఆశ్రం ఆసుపత్రి నుంచి దుకాణాలు మొదలు..

సీతాఫలాల దుకాణాలు సీజన్ ప్రారంభమైన వెంటనే ఏలూరులోకి ప్రవేశించే రహదారి ఆశ్రం ఆసుపత్రి వద్ద నుంచి దుకాణాలు ప్రత్యక్షమౌతాయి. జిల్లాలోని మెట్ట ప్రాంతాల నుంచి సరుకు తీసుకువచ్చి ఇక్కడ వ్యాపారాలు చేసుకునే వారికి కొంతమంది మధ్యవర్తులు సరఫరా చేస్తారు. కొంత మంది సైకిళ్లపై బుట్టల్లో పెట్టుకుని వ్యాపారాలు చేస్తుండగా మరి కొంతమంది రహదారి పక్కనే చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేస్తుంటారు. అక్కడి నుంచి ప్రారంభమైన సీతాఫలాల దుకాణాలు ఏలూరు ఒన్‌టౌన్‌లో పాత బస్టాండు, బిర్లాభవన్ సెంటర్, కై కలూరు రోడ్డు తదితర ప్రాంతాలతో పాటు టూటౌన్‌లోని ఓవర్ బ్రిడ్జి పక్క నుంచి పవర్‌పేట స్టేషన్‌కు వెళ్లే రహదారి పొడవునా సీతాఫలాల దుకాణాలు కనిపిస్తాయి.

ధర కఠినం..

పండ్ల ప్రియులకు చూడగానే నోరూరించే సీతాఫలాలు నాలుగైదేళ్ల క్రితం వరకూ ఒక మాదిరి సైజు పండ్లు డజను రూ. 150కే లభించేవి. అయితే రానురాను లాభసాటిగా లేకపోవడంతో రైతులు తోటలు తొలగించడం, ఏజెన్సీల్లోని అటవీ ప్రాంతంలో కూడా పండ్ల దిగుబడి సరిగా లేకపోవడంతో వీటి ధరలు అమాంతం పెరిగిపోయాయి. గతంలో పండ్ల ప్రియులు సీతాఫలాలను బుట్టల లెక్కన కొనుగోలు చేసేవారు. అప్పట్లో ధరలు అంతలా అందుబాటులో ఉండేవి. కాలక్రమంలో వీటి ధరలు పెరగడంతో ఇప్పుడు డజన్ల లెక్కనే కొనుగోలు చేయాల్సి వస్తోంది. కాయల సైజులను బట్టి మరీ చిన్నవైతే డజను రూ.150లకే వస్తున్నా అవి ఇంటికి తీసుకువెళ్లిన తరువాత పండకపోవడం, పచ్చి కాయలే గిడసమారిపోయి తినడానికి వీలులేకుండా ఉండడంతో వాటిని కొనుగోలు చేయడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మీడియం సైజు పండ్లు డజను రూ.300 నుంచి పెద్ద సైజు రూ.500 వరకు విక్రయిస్తున్నారు.

ఉపాధికి ఊతం..

సాధారణంగా నగరంలో పండ్ల వ్యాపారులు ఏ సీజన్‌లో దొరికే పండ్లతో ఉపాధి పొందుతారు. ఎక్కువగా మామిడి పండ్ల సీజన్‌లో వీరికి ఉపాధి ఎక్కువగా దొరుకుతుంది. మామిడి పండ్ల సీజన్ ముగిసిన తరువాత కనీసం నెలాపదిహేను రోజులకు గానీ సీతాఫలాల సీజన్ ప్రారంభం కాదు. సీతాఫలాల సీజన్ ప్రాంభమయ్యే వరకూ ఈ వ్యాపారులంతా యాపిల్, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, కివీ ఫ్రూట్, కర్బూర పండు వంటివి విక్రయిస్తూ కాలక్షేపం చేస్తారు. సీతా ఫలాల సీజన్ ప్రాంభమైన నాటి నుంచి వీరి ఉపాధికి ఊతం అందుతుంది. సీజనల్‌గా దొరికే పండు కావడంతో ఎక్కువ మంది కొనుగోలు చేస్తారు కాబట్టి వీరికి లాభాలు అధికంగానే వస్తాయి.

డిసెంబర్ నుంచి సోలాపూర్ ఫలాలు

ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సీతాఫలాలు దాదాపు నవంబర్ నెల చివరి వరకూ వస్తూనే ఉంటాయి. ఏలూరులోని ఏజెన్సీ ప్రాంతాలతో పాటు, రాజమండ్రి ఫలాలు కూడా కాపు ముగుస్తున్న సమయానికి నగరంలో సోలాపూర్ పండ్లు ప్రత్యక్షమౌతాయి. వ్యాపారులు షోలాపూర్ నుంచి దిగుమతి చేసుకుని తమ వ్యాపారాలు కొనసాగి స్తుంటారు. ఇవి చూడటానికి నిగనిగలాడుతూ కనిపిస్తుంటాయి. రుచికి ఈ ప్రాంతం పండ్లతో పోటీ పడలేకపోయినా పండ్ల ప్రేమికులకు ప్రత్యామ్నాయంగా దొరుకుతుండడంతో వాటిని కూడా కొనుగోలు చేయడానికి ఇక్కడి ప్రజలు వెనుకాడడం లేదు.

సీజన్లో దొరికే ఫలాలు తినాలి..



సీజన్‌లో దొరికే ఫలాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలు ఉంటాయి. ప్రకృతి మనకు సీజనల్ వారీగా వచ్చే రుగ్మతల నుంచి నివారణగా ఫలాలను ప్రసాదిస్తుంది. ముఖ్యంగా ఈ సీజన్లో సీతాఫలాలను తీసుకోవడం వలన ఆరోగ్యపరంగా కూడా అనేక ప్రయోజనాలను పొందవచ్చు. అందుకనే వీటికి మార్కెట్లో డిమాండ్ ఉంటుంది. నేటి ఆధునిక సమాజంలో అంతా రెడీమేడ్, జంక్ ఫుడ్‌లకు అలవాటు పడటం వలన జబ్బుల బారిన పడుతున్నారు. ఆస్పత్రులలో చేరి, పండ్లు తిని నయం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి సీజనల్‌గా దొరికే పండ్లను నిర్లక్ష్యం చేయకుండా, ఒక్కసారైనా వాటిని తింటే ఆయా సీజన్లలో వచ్చే రుగ్మతల నుంచి తప్పించుకోవచ్చు.

దాక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్, ఆంధ్ర హాస్పిటల్ డైరెక్టర్

పోలీస్ సంక్షేమానికి ప్రాధాన్యత



ఉద్యోగ నియామక పత్రం అందజేస్తోన్న జిల్లా ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తోన్న పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందనీ, వారి కుటుంబాలకు సైతం అండగా ఉంటామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఉద్యోగ నిర్వహణలో ఉంటూ మృతిచెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు కారుణ్య నియామకంలో భాగంగా ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎస్ఐ పెద్దిరాజు కుమారుడు పీ.నవీన్‌కుమార్‌కు ఉద్యోగ నియామక పత్రాన్ని ఆయన అందజేశారు. పోలీస్ సిబ్బంది నిత్యం ప్రజల సేవలో బిజీగా ఉంటారనీ, తమ కుటుంబాలను సైతం పక్కనబెట్టి విధులను సక్రమంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తారని తెలిపారు. సిబ్బంది కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందన్నారు.

సనాతన ధర్మం సంఘ ఆధ్వర్యంలో అన్న సమారాధన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక గులాబి తోటలో సనాతన ధర్మం సంఘం ఆధ్వర్యంలో సోమవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం శ్రీ కాశీ అన్నపూర్ణాదేవికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మం సంఘం సభ్యులు దారపురెడ్డి వేంకటరత్నంనాయుడు, ఎల్‌వీ శివారెడ్డి, సత్యనారాయణలు ఉన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్



జయప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్ టీయూసీ జిల్లా కార్యదర్శి వెంకట్, తదితరులు



సమన్వయకర్త జయప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ లీగల్ సెల్ సభ్యులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో అరాచకపాలన సాగుతుందనీ, ప్రజలు ఎవరూ సంతోషంగా లేరని, కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ పేర్కొన్నారు. ఏలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలకు జిల్లాస్థాయి పదవుల్లో నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో వారంతా ఏలూరులో పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త జేపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో కీలక పదవుల్లో నియమించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుకు తమ అభినందనలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త జేపీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలం అయ్యారనీ, కేవలం ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా జైలుకు ఎలా పంపాలో కుట్రలు చేయటం మినహా చేసేదేమీ లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయనీ, కనీసం ఎరువులు సకాలంలో అందించ లేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. నెలల తరబడి ఎరువుల కోసం రైతులు షాపుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మహిళలకు ఇస్తామన్న మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ గాలికి వదిలేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీయూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి బంకురు వెంకట్, డెక్కత జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా యశ్వంత్, కార్యదర్శి భువనగిరి మధు కుమార్, ఈసీ మెంబర్లు చాట్రగడ్డ సౌజన్య, కే.మోహన్‌చంద్ర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షులు ఘంటా రాజేశ్వరరావు, లీగల్ సెల్ ఏలూరు అధ్యక్షులు ప్రత్తిపాటి తంబి, ప్రత్తిపాటి విజయ్, కోన తంబి, ఈసీ మెంబర్ దుర్గారావు తదితరులు ఉన్నారు.

ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం అందించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఇమామ్, మౌజన్లకు ప్రతి నెలా ఇచ్చే గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం ఆపివేయడాన్ని నిరసిస్తూ నూర్బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు వి. ఖాదర్ భాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ హఫీజ్ ఖాన్ యొక్క పిలుపు మేరకు ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు యూనిస్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాల పెండింగ్ మొత్తాలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఇమామ్‌లకు నెలకు రూ.10వేలు, మౌజన్లకు రూ.5వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ఈ ఏడాది జనవరి నుంచి గౌరవ వేతనాలు నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల ప్రకటనకు ముందు 2024 మార్చి వరకు ఉన్న అన్ని నెలల గౌరవ వేతనాలు చెల్లించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చిరంజీవి, ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ జేపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ, రాష్ట్ర కార్యదర్శి షకీల్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాజుల బాజీ, కొయ్యలగూడెం మండల మైనారిటీ నాయకులు షేక్ మస్తాన్, ఏలూరు జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి షేక్ అజ్మీర్, ఉంగుటూరు నియోజకవర్గం నూర్ భాషా సంఘం అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, ఉంగుటూరు నియోజకవర్గం నూర్ భాషా సంఘం గౌరవ అధ్యక్షుడు షేక్ పింటూ సాహెబ్, గణపవరం మైనార్టీ నాయకులు మొహమ్మద్ జానీ, దెందులూరు నియోజకవర్గం అధ్యక్షుడు రెహమాన్ బాబు లక్కవరం మైనారిటీ నాయకులు సయ్యద్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	40	బీన్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	36
బెండకాయలు	20	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	50	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20-26	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	11
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

వృద్ధులకు చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): నిరాశ్రయులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వద్దని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సోమవారం స్థానిక పత్తేబాదులోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ పరిసర ప్రాంతాలు వసతి గృహాలను సందర్శించి స్థితిగతులపై ఎప్పటికప్పుడు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారికి రిపోర్టు సమర్పించాల్సి ఉందన్నారు. ఆహార పదార్థాలు నాణ్యత, పరిసరాల శుభ్రత, వైద్య సదుపాయాలు పైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోగికి ఒక వ్యక్తిని తోడుగా పంపించాలని ఆదేశించామని తెలిపారు. అలాగే వసతి గృహంలోని వృద్ధులకు సీనియర్ సిటిజన్ చట్టాలపై అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వసతి గృహ నిర్వాహకులు, సిబ్బంది, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

దెందులూరు: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కారానికి గడువులోపు కృషి చేయాలని ఏలూరు రూరల్ మండల తహసీల్దార్ జి విజయ కుమార్ రాజు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అన్ని గ్రామాల వీఆర్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ఎప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం చేసినవి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కారం చేయాలని అనంతరం వాటి వివరాలు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు నాగమణి, ప్రియదర్శిని, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజయ్, అన్ని గ్రామాల వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఏకాగ్రతతో శిక్షణ పొందాలి



శిక్షణ కార్యక్రమానికి హాజరైన డ్రైవర్లతో రవాణా, ఆర్టీసీ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు జిల్లా ఏలూరులో సోమవారం హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతుల స్కూల్‌ని ఏలూరు ఆర్టీసీ డిపోలో జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎస్‌కే. కరీం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందిందని ఆ సంస్థ నుంచి డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఇక్కడ డ్రైవింగ్ నేర్చుకున్న వారికి ఎక్కడికి వెళ్లినా హెవీ డ్రైవింగ్‌లో ఉద్యోగ అర్హత పొందవచ్చని, ఇక్కడ శిక్షణ పొందడం వల్ల గ్యారేజీలో ప్రత్యక్షంగా ప్రతి పార్ట్‌ని చూసి తగిన అవగాహన పొంది డ్రైవింగ్‌లో మరిన్ని మెళుకువలు నేర్చుకోవచ్చన్నారు. రోడ్డుపై వాహనం నడుపుతున్నప్పుడు రోడ్డుపై పూర్తి అవగాహన ఏర్పడుతుందని, ఏకాగ్రతతో పూర్తిగా శిక్షణ పొందాలని సూచించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షబ్నం మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో శిక్షణ పొందిన వారందరూ 18 నెలల తర్వాత తమ సంస్థలోనే ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లుగా పని చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బీ. వాణి, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

భీమవరం డ్వామా ఏవోగా శ్రీలత

దెందులూరు: ఏలూరు రూరల్ ఎంపీడీవో వీ. శ్రీలత భీమవరం డ్వామా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం లిఖిత పూర్వక నియామకపు పదోన్నతి ఆదేశాలను జారీ చేశారు. ఏలూరు మండల ప్రభుత్వ శాఖల అధికారులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఎంపీటీసీలు, సర్పంచ్లు సోమవారం పదోన్నతి పొందిన ఎంపీడీవో శ్రీలతను ఘనంగా సత్కరించి అభినందించారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆయనకు నివాళులర్పించారు. సోమవారం నాడు స్థానిక పవర్ పేటలో గల ఉద్దరాజు రామం భవనంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డీఎన్‌విడి ప్రసాద్ అధ్యక్షతన సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి బలరాం , ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ లింగరాజు, తెల్లం రామకృష్ణ, కె శ్రీనివాసు, పి రామకృష్ణ, జిల్లా నాయకులు ఎం జీవరత్నం , ఎస్ మహంకాళి రావు, తామ ముత్యాలమ్మ, పి మంగరాజు, పి సూర్యారావు, గుడిపాటి నరసింహారావు, పంపన రవికుమార్, శ్యామల రాణి, అరుణకుమారి, కనకారావు, గోపి, ఇస్సాకు, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం నేపథ్యంలో ఆటో, మాక్సీ, క్యాబ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని తక్షణం వీరిని ఆదుకోవాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరావు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి ఆటో డ్రైవర్ల పట్ల ఎటువంటి కనికరం లేదన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి లేక నిరుద్యోగ యువకులు ఉన్నత చదువులు చదివి ఆటో డ్రైవర్లుగా మారారన్నారు. ప్రైవేట్ ఫైనాన్స్ దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆటోలను కొనుగోలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అలాంటి వారిపై ప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్ రేట్లు పెంచడం, బీమా ప్రీమియం రేట్లు పెంపుదల, ఆర్టీ చలానాలు, ఈ చలానా ఫైన్లు, సెన్సార్ ఫైన్, ప్రైవేట్ ఫైనాన్సర్ల అధిక వడ్డీల దోపిడీలకు బలైపోతున్నారు. మూలిగే నక్క మీద తాటి పండు పడిన చందంగా ఉచిత బస్సు సౌకర్యం ప్రవేశ పెట్టడం వల్ల ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా, నియోజకవర్గ నాయకులు, ఆటో కార్మిక సోదరులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.